## గురుకులంలో బాలురకు స్పాట్ అడ్మిషన్లు

నర్సాపూర్, మే 24: స్థానిక అల్లూరి సీతా రామరాజు గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఈ నెల 27న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఎంపీసీ, బీపీసీ, ఏఅండ్‌టీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

## మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా మమత

చిలిపిచెడ్, మే 24: మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా కొడిపిగంటి మమత (జగ్గంపేట) ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏపీఎం ప్రేమలత తెలిపారు. శనివారం చిలిపిచెడ్ మండల మహిళా సమైఖ్య సంఘం కార్యాలయంలో ఎన్నికల అధికారి ఏపీఎం రుక్మిణి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా చిలుక మాధురి(చిట్కుల్), కోశాధికారిగా బట్టు అంజలి(చండూర్) ఎన్నికైనట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట, మే 24: మండలంలోని సూరారం, ధర్పల్లి, గవ్వలపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దినకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, వైర్ల కింద ఉన్న చెట్ల నరికివేత, మెయింటెనెన్స్ వర్క్ ఉండడంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

## స్వర్ణకారులు సంఘటితంగా ముందుకు సాగాలి



నూతన కమిటీని సన్మానిస్తున్న స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచారి

మెదక్ మున్సిపాలిటీ, మే 24: స్వర్ణకారులు సంఘటితంగా ముందుకు సాగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పూన రవిచారి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో శనివారం ఆలయ నూతన కమిటీ, వయోజన, యువజన కమిటీల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న స్వర్ణకారుల జీవితాలు అయోమయంగా మారాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద స్వర్ణకారులు, విశ్వకర్మలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి నిమల్లి శ్రీనివాస్, కామారెడ్డి, రామాయంపేట సంఘాల అధ్యక్షులు చక్రం చారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కన్వెన్షన్ హాల్ టెండర్ వాయిదా

రామాయంపేట, మే 24: మండలంలోని డీ.ధర్మారంలో ఉన్న ఫంక్షన్ హాల్‌లో మైనర్ పనులు ఉన్న దృష్ట్యా టెండర్ ప్రక్రియను కొద్ది రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ఎంపీడీవో షాజులుద్దీన్ పేర్కొన్నారు. శనివారం పంచాయతీ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియకు గ్రామస్తులు భారీగా కన్వెన్షన్ హాల్‌కు చేరుకున్నారు. కన్వెన్షన్ హాల్‌లో కొన్ని మైనర్ పనులు చేపట్టాలని అందుకోసం వారం రోజుల తర్వాత టెండర్ వేయాలని అన్నారు. గ్రామస్తులకు మళ్లీ నోటీసు పంపుతామని అంతవరకు టెండర్‌ను ఆపేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో రాజేందర్, గ్రామ కార్యదర్శి మహేందర్ ఉన్నారు.

## తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద డ్రగ్స్ పట్టివేత

తూప్రాన్, మే 24: తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఓపీఎం డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న వ్యక్తిని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో, నమ్మదగిన సమాచారం మేరకు సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో రాజస్థాన్‌కు చెందిన రామ్ దయాల్ వద్ద నుంచి 398 గ్రాముల ఓపీఎం మత్తుమందును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మొబైల్‌ను సీజ్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FINANCE
★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

WANTED
★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# పైసల్లివ్వకున్నా.. తప్పని పనులు

- పారిశుధ్యానికి పైసా విదిల్చని ప్రభుత్వం
- డీజిల్ లేక చెత్త సేకరణ ట్రాక్టర్లు బంద్
- చెత్తతో పేరుకుపోయి కంపుకొడుతున్న మురుగు కాలువలు



రామాయంపేట: అక్కన్నపేటలో మురుగు కాల్వను శుభ్రం



రామాయంపేట: రాయిలాపూర్‌లో కాల్వ తీస్తున్న పారిశుధ్య కార్మికులు



కొల్చారం: కోనాపూర్‌లో పిచ్చి మొక్కలతో నిండిపోయిన కాలువ

రామాయంపేట, మే 24: గ్రామాల్లో మురుగు కాల్వలు కంపుకొడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పైసా విదిల్చడంలేదు. దీంతో ఏ గ్రామంలో చూసినా మురుగు కాల్వలు కంపుకొడుతున్నాయి. అలాగే ఉంచితే ప్రజలు సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ వాటి బారిన పడే ప్రమాదం ఉంది. కార్యదర్శులు తమ బాధ్యతగా గ్రామాలు శుభ్రంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పారిశుధ్య కార్మికులతో పనులు చేయిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కార్యదర్శులు తమ సొంత డబ్బులు పెట్టి పనులు చేయిస్తున్నారు. చెత్త ట్రాక్టర్లకు సైతం డీజిల్‌కు డబ్బులు కూడా కార్యదర్శులు సమకూరుస్తున్నారు. రామాయంపేట మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోనే ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ పంచాయతీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

### కోనాపూర్‌లో పడకేసిన పారిశుధ్యం

కొల్చారం, మే 22: గల్లీ చిన్నది పాటలో 'కోరి కోరి కోడి కూర వండుకుంటె మోరి మురుగు వాసనకు కూర కంపు కొట్టెనో' అన్న చందంగా కోనాపూర్‌లోని హరిజనవాడలో మురుగు కాల్వలు చెత్తాచెదారంతో నిండిపోయి కంపుకొడుతున్నాయి. ఎనిమిది నెలలుగా శుభ్రం చేయలేదని కాలనీవాసులు చెపుతున్నారు. పంచాయతీ సెక్రటరీ ఒక్క రోజు కూడా గ్రామంలో తిరిగి చూసిన పాపానపోలేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. మోరీలోని మురుగు నీరు గుమ్మం వరకు వస్తున్నదని, వాసనతో భరించలేకపోతున్నామని ఎన్నిసార్లు పంచాయతీ సిబ్బందికి చెప్పినా ఫలితం లేకుండా పోతున్నదని వాపోతున్నారు. దీనికి తోడు గ్రామంలోకి చెత్త ట్రాక్టర్ రావడంలేదు. ఇండ్లలోని చెత్తను రోడ్ల పక్కన, మోరీల్లో వేస్తున్నారు. గతంలో పెంట కుప్ప ఉంటే చెత్త అందులో వేసే వాళ్లమని, చెత్త ట్రాక్టర్ రావడంతో పెంట కుప్పలు తొలిగించారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పుడు ట్రాక్టర్ అడిగితే డీజిల్ లేదంటున్నారు.

### డబ్బులు రావడం లేవంటున్న కార్యదర్శులు

రామాయంపేట రూరల్, మే 16: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఆరుబయట చెత్తాచెదారం పడేయకుండా చెత్త బుట్టల్లో వేసి డంప్ యార్డులకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీకి ఒక ట్రాక్టర్ ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాల్లో చెత్త బుట్టలో నింపి, ట్రాక్టర్ వచ్చినప్పుడు అందులో వేయడం అలవాటు చేసుకున్నారు ప్రజలు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇది కాస్త దారితప్పింది. స్థానిక సంస్థల గడువు ముగియడంతో గ్రామాల పాలన ప్రత్యేక అధికారులు, కార్యదర్శులకు అప్పగించారు. గ్రామాల్లో పనుల నిర్వహణకు నిధులు కేటాయించడంలో అలసత్వంతో పాటు నిర్లక్ష్యం చేయడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. పారిశుధ్య కార్మికులకు సైతం వేతనాలు ఇవ్వని దుస్థితి నెలకొన్నది. దీంతో పరిపాలన మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నామని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రామాయంపేట: దామరచెర్వు గ్రామంలో మురుగు కాల్వలు శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు



కొల్చారం: కోనాపూర్‌లో



సుతారిపల్లిలో మురుగు కాల్వలు తీస్తున్న సపాయి కార్మికులు



రామాయంపేట రూరల్: డీజిల్ లేక నిలిచిపోయిన చెత్త సేకరణ ట్రాక్టర్

# మొలకలు వచ్చి.. ముక్కిన ధాన్యం



కొల్చారం: ముక్కిపోయి బూజుపట్టిన ధాన్యం



కొల్చారం: తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న కూలీలు



చిలిపిచెడ్: బస్తాల్లో మొలకెత్తిన ధాన్యం

- మళ్లీమళ్లీ ఆరబెడుతున్న రైతులు
- అన్నదాతలపై అదనపు భారం

కొల్చారం, మే 24: ధాన్యం నూర్పిడి చేసి అమ్ముకోడానికి కొనుగోలు కేంద్రంలో పోసి ఇక కష్టం తీరింది అనుకున్న తరుణంలో అధికారుల నిర్లక్ష్యంతో రైతుకు కష్టాలు తప్పడంలేదు. వారం రోజులుగా కురిస్తున్న వర్షాలకు మండలంలోని పైతర, తుక్కాపూర్, కోనాపూర్, వై మాందాపూర్, ఎనగండ్ల గ్రామాల్లో ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసి, మొలకలు వచ్చి, ముక్కిపోయి రంగు మారాయి. తూకం వేసిన బస్తాలు సైతం తడిసి, మొలకలు రావడంతో ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టే పనిలో రైతులు మునిగిపోయారు. తడిసిన ధాన్యం కుప్పలు, బస్తాలను ఆరబోయడానికి మళ్లీ కూలీలపై ఆధార పడాల్సి వస్తుండడంతో అదనపు భారం పడుతోంది. లారీలు వస్తలేవు, ధాన్యం త్వరగా తరలించండని రైతులు మొరపెట్టుకున్నా కంటి తుడుపు చర్యలు చేపట్టి వదిలేస్తున్నారు.

### అకాల వర్షాలకు తడిసిన ధాన్యం

చిలిపిచెడ్, మే 24: ఆరుగాలం కష్టపడి పడించిన ధాన్యం అకాల వర్షాలతో తడిసి ముద్దయ్యింది. కేంద్రాల్లో కొనుగోళ్లు ఆలస్యం కావడంతో తూకం వేయడంలో ఐకేపీ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరించడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తరుగు, లారీలకు అదనపు చార్జీలు వంటి సమస్యలతో రైతులు చుక్కలు చూస్తున్నారు. చండూర్, చిలిపిచెడ్, చిట్కుల్, అజ్జమర్రి కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు ఎక్కడివి అక్కడే ఉండడంతో వర్షానికి తడిసి మొలకలు వచ్చాయి. కొనుగోలు కేంద్రాల్లో రైస్‌మిల్లులకు వెళ్లిన లారీల్లో ఒక బస్తాకు మూడు నుంచి ఐదు కిలోల తరుగు తీస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. లారీ యజమానులు ఒక్కొక్క బస్తాకు రూ.2 నుంచి 3 అదనంగా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు.

### కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలి

అల్లాదుర్గం, మే 24: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చూడాలని అల్లాదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షుడు బ్రహ్మం తహసీల్దార్ మల్లయ్యకు శనివారం వినతి పత్రం అందజేశారు. హన్మ్యానాయక్, పరశురాం ఉన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఉపాధ్యాయుల ర్యాలీ



అల్లాదుర్గంలో..



రామాయంపేటలో..



చిన్నశంకరంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అల్లాదుర్గం, మే 24: ఆపరేషన్ సిందూర్‌తో ఆర్మీ జవాన్లు, త్రివిధ దళాల ధైర్య సాహసాలను స్మరించుకుంటూ అల్లాదుర్గంలో శనివారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి ప్రధాన వీధుల గుండా తిరంగా ర్యాలీ కొనసాగింది.

### రామాయంపేటలో..

రామాయంపేట, మే 24: రామాయంపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆపరేషన్ సిందూర్‌కు ప్రభుత్వ ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనికులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో అయిత శ్రీనివాస్, హెచ్‌ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

### చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, మే 24: దేశ సైనికులకు మద్దతుగా చిన్నశంకరంపేటలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. చిన్నశంకరంపేటలోని మోడల్ పాఠశాలలో శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో త్రివర్ణ పతాకాలను పట్టుకొని ర్యాలీ చేశారు. దేశ సైనికులకు మద్దతుగా జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్ ముష్కరుల చేతిలో మృతి చెందిన ఆర్మీ సైనికులు, పౌరులకు మండల విద్యాధికారి పుష్పవేణి, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



యాదగిరి (ఫైల్)

చేగుంట, మే 24: అప్పుల బాధతో రైతు తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నార్సింగి మండలంలోని సంకాపూర్ గ్రామానికి చెందిన రైతు బైకరి యాదగిరి (39), అదే గ్రామానికి చెందిన బైకరి ఐలయ్యకు అవసరాల నిమిత్తం వేరే చోట అప్పు తెచ్చి రూ.3 లక్షల 70 వేలు సమకూర్చాడు. కాగా ఐలయ్యను డబ్బులు తిరిగి చెల్లించాలని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వలేదు. వేరే చోట తెచ్చిన అప్పుల వాళ్లు యాదగిరిని అప్పు చెల్లించాలని అడగడంతో, తెచ్చిన అప్పు తీర్చలేక మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అనుమానం వచ్చిన కుటుంబీకులు పరిసర ప్రాంతాల్లో వెతుకగా తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని తనువు చాలించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీలో రసాభాస

తూప్రాన్, మే 24: తూప్రాన్‌లోని తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా సాగింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 163 మంది లబ్ధిదారులకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి చెక్కులు అందజేశారు. తొలుత నర్సారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కొనసాగిస్తున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ తొలుత యాభై వేలున్న కల్యాణ లక్ష్మిని రూ. లక్షకు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా లక్షతో పాటు తులం బంగారాన్ని మంజూరు చేయాలన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ ఇక్కడ ఏం చేశాడు, కేసీఆర్ గురించి మాట్లాడవద్దంటూ సభలో జై కాంగ్రెస్ నినాదాలతో గందరగోళం సృష్టించారు. తాము అందరిని కలుపుకొనిపోయి సమర్థవంతమైన ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తుంటే, కాంగ్రెస్ నాయకులు గోల చేయడం సరికాదన్నారు. దీంతో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, భూంరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## గో వధను అడ్డుకోవాలని వినతి



పాపన్నపేట: వినతిపత్రం ఇస్తున్ననాయకులు

పాపన్నపేట/చిన్నశంకరంపేట, మే 24: గో వధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు తహసీల్దార్ సతీశ్, ఎస్ఐ శ్రీధర్‌గౌడ్‌కు శనివారం వినతి పత్రం సమర్పించారు. బక్రీద్ రానున్నదని గోవధ జరిగే అవకాశాలు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటివి ఎక్కడ జరిగిన తమ కార్యకర్తలు అడ్డుకోవాలని, పోలీసులకు సమాచారం అందించాలని వారు తెలిపారు. బోల కృష్ణ, భువనేశ్వర్, రాజేశ్, హరిబాబు ఉన్నారు. చిన్నశంకరంపేట తహసీల్దార్ అబ్దుల్ మన్నన్‌కు, పోలీస్ స్టేషన్‌లో గోరక్షణ చట్టాన్ని అమలు చేయాలని బజరంగ్‌దళ్ నాయకులు నీలశ్యాం, రవీందర్, సతీశ్, మహేందర్, బండారు శంకర్ వినతి పత్రం అందజేశారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి నాగమాధురి

పాపన్నపేట, మే 24: కల్తీ విత్తనాలు అమ్మితే సంబంధిత దుకాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో నాగమాధురి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. శనివారం పాపన్నపేటలో ఫర్టిలైజర్ షాపుల యాజమానులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విత్తన పాకెట్‌పై ప్రభుత్వ ధ్రువీకరణ ట్యాగ్ ఉండేలా చూసుకోవాలన్నారు. ఇది నీలం, ఆకుపచ్చ రంగుల్లో ఉంటుందన్నారు. ప్రతి పాకెట్‌పై విత్తన రకం లాట్ నంబర్ ఉండేలా చూసుకోవాలన్నారు. విత్తనాల గడువు తేదీ కూడా నిర్ధారించుకోవాలని చెప్పారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రసీదు ఇవ్వాలని సూచించారు.

## బీఆర్ఎస్ నేతకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



మెదక్ మున్సిపాలిటీ, మే 24: అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న మార్కెట్ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్ శనివారం పరామర్శించారు. బీఆర్ఎస్ మెదక్ బీఆర్ఎస్ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్లు జయరాజు, శ్రీనివాస్, ప్రభురెడ్డి, లింగారెడ్డి ఉన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

- రైతులు అధైర్యపడొద్దు
- కలెక్టర్ రాహుల్‌రాజ్



అంబాజిపేటలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చిన్నశంకరంపేట, మే 24: రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నదని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రైతుల అకౌంట్‌లో ఎప్పటికప్పుడు డబ్బులు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఈరోజు వరకు 2.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొన్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ మన్నన్, కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

## అనాథ పిల్లలకు పీఆర్టీయూ అండ



పాపన్నపేట, మే 24: మండలంలోని కుర్తివాడకు చెందిన తల్లిదండ్రులు లేని ముగ్గురు పిల్లలకు పీఆర్టీయూ అండగా నిలిచి, రూ.26వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. టేక్మాల్ కేజీబీవీలో లావణ్య 9వ, అనురాధ 7వ తరగతి చదువుతున్నారు. కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో నవీన్ 4వ తరగతి చదువుతున్నాడు. వీరి విషయం సీఆర్పీ దేవయ్య పీఆర్టీయూ నాయకులకు చెప్పడంతో వారు స్పందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు, సురేశ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అంజనాచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జనార్దన్, జిల్లా కార్యదర్శి స్వామి, మండల అసోసియేట్ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కార్యదర్శి నాగేశ్వర్, జిల్లా బాధ్యులు సాయిలు, మధుసూదన్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు, అంబులెన్స్ ఢీ

అల్లాదుర్గం, మే 24: ఆర్టీసీ బస్సు, 102 మదర్ అండ్ చైల్డ్ అంబులెన్స్ ఢీకొని ముగ్గురికి గాయాలైన ఘటన అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిల్వెర వద్ద జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోమటికుంట తండాకు చెందిన చామంతి కాన్పు తర్వాత తన తల్లి జంకి బాయితో కలిసి 102 మదర్ అండ్ చైల్డ్ అంబులెన్‌లో ఇంటికి వెళ్తున్నది. ఈ క్రమంలో 161 జాతీయ రహదారి చిల్వెర సర్వీస్ రోడ్డుపై ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో అంబులెన్‌లోని ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని జోగిపేట ప్రభుత్వ దవఖానకు తరలించారు. అంబులెన్స్ డ్రైవర్ ప్రతాప్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గ్రామీణ ప్రజలకు ఉచిత న్యాయ సాయం




నర్సాపూర్, మే 24: గ్రామీణ ప్రజలకు ఉచిత న్యాయ సాయం అందించడానికి మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ కోర్టును ఆశ్రయించవచ్చని జూనియర్ సివిల్ జడ్జి హేమలత సూచించారు. నర్సాపూర్‌లోని కోర్టు ప్రాంగణంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై, వ్యవసాయాధికారులు, పంచాయతీ సెక్రటరీలతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నర్సాపూర్, కౌడిపల్లి, శివ్వంపేట్, చిలిపిచెడ్ మండలాల గ్రామీణ ప్రాంత ప్రజలు పలు రకాల సమస్యలతో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్, న్యాయవాదులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్సైలు, పంచాయతీ సెక్రటరీలు, వ్యవసాయాధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

రామాయంపేట/మెదక్ మున్సిపాలిటీ, మే 24: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని ఇంటర్ బోర్డు జిల్లా అధికారిణి మాధవి పేర్కొన్నారు. శనివారం రామాయంపేటలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్న స్నేహ కళాశాలకు విచ్చేసి, పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో 22 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 5820 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. గణితం, వృక్ష శాస్త్రం, రాజనీతి శాస్త్రం ప్రథమ సంవత్సర పరీక్షకు 3073 మందికి 2949 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షకు 866 మందికి 822 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### మోడల్ స్కూల్‌కు 11 మంది ఎంపిక



వడ్ల ప్రణవి

నర్సాపూర్, మే 24: ఎంపీయూపీఎస్ చిప్పల్‌తుర్తి పాఠశాల నుంచి జక్కపల్లి మోడల్ 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో తారాసింగ్ తెలిపారు. ఇందులో విద్యార్థిని వడ్ల ప్రణవి రాష్ట్రంలో 19వ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిందన్నారు. జిల్లా స్థాయిలో 10వ ర్యాంకులోపు నలుగురు విద్యార్థులున్నారన్నారు. ఎంఈ వో, హెచ్‌ఎం రవికుమార్, టీచర్లు అభినందించారు.

### మోడల్ హౌస్‌ను పరిశీలించిన ప్రాజెక్ట్ డైరెక్టర్

కొల్చారం, మే 24: కొల్చారంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ స్లాబ్ దశకు చేరుకున్నది. శనివారం ప్రాజెక్ట్ డైరెక్టర్ మాణిక్యం ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఎంపీవో కృష్ణవేణి ఉన్నారు.

### పాలిసెట్ ఫలితాల విడుదల

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్, మే 24: పాలిసెట్ ప్రవేశ పరీక్షలు ఫలితాలు శనివారం విడుదల య్యాయి. జిల్లా వ్యాప్తంగా 1705 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1287 మంది అర్హత సాధించారు. నర్సాపూర్ పట్టణానికి చెందిన సాయిభవానీ రాష్ట్రస్థాయిలో 233 ర్యాంక్, మెదక్ పట్టణానికి చెందిన ఫణీంద్ర ప్రతాప్‌రెడ్డి 317, డీ.ధర్మారం గ్రామానికి చెం దిన అధిత్యరాం 420 ర్యాంకు సాధించారు.

### మారిన విద్యుత్ సబ్ స్టేషన్, అధికారుల నంబర్లు

నిజాంపేట,మే24: మండల వ్యాప్తంగా పలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు ఏఈ గణేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాంపేట ఏఈ 8712473362, నిజాంపేట 87124 473437, నస్కల్ 8712473441, బచ్చురాజ్‌పల్లి 8712473449, కల్వకుంట 8712473440, నార్లపూర్ 87124 73448, ధర్మారం 8712473439 ఫోన్ నంబర్లను కేటాయించారు.

### తహసీల్దార్‌కు సన్మానం



నిజాంపేట, మే 24: నిజాంపేట తహసీల్దార్‌గా విధుల్లో చేరిన శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ నాయకుడు, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు గౌస్, అంజాగౌడ్, లింగాగౌడ్ శనివారం సన్మానించారు.